క్లుప్తంగా

సీఎండీ బలరాం నాయక్‌ను కలిసిన నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల శ్రేయస్సు, సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్మికుల పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, కాలుష్యం నివారణకు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ చేయాలని కోరారు. అన్ని అమలయ్యే విధంగా చూస్తానని సీఎండీ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, టీపీసీసీ వార్‌రూం కన్వీనర్ విజయ్ భాస్కర్, మధుసూన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌సీ హన్మకొండ జిల్లా చైర్మన్‌గా భాస్కర్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న భాస్కర్‌రావు

హుజూరాబాద్‌రూరల్: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిటీ హన్మకొండ జిల్లా చైర్మన్‌గా రాంపూర్ గ్రామానికి చెందిన కుడికాలు భాస్కర్‌రావును నియమించినట్లు రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రచారం, అవగాహన సదస్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు నియామకం చేశామన్నారు. నియామకానికి కృషి చేసిన బాధ్యులకు భాస్కర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి అవార్డు

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ప్రజాకవి నాగుల సత్యంగౌడ్ సామాజిక సేవలను గుర్తించి మెగా ఎంటర్‌ప్రైజెస్ సేవా సంస్థ జాతీయ స్థాయి సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శిరీషారెడ్డి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు.

బొల్లి ఐలయ్యకు డాక్టరేట్



ఐలయ్యకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, తదితరులు

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్ బొల్లి ఐలయ్యకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామకృష్ణవేణి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేయగా ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కరాటేలో విశేష సేవలు అందించడం, విద్యార్థులను సుశిక్షితులను చేసినందుకు అవార్డు వచ్చినట్లు ఐలయ్య వివరించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొత్వాల్ దయానంద్, ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ మార్గరేట్ అమూల్, నిర్వాహకులు శిరీషారెడ్డి, జెమినీ సురేశ్ పాల్గొన్నారని తెలిపారు.

'కేంద్ర మంత్రి 'బండి' రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడటం విడ్డూరం'

సైదాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పైసా తీసుకురాని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడడం విడ్డూరంగా ఉందని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధుల వరద కురిపిస్తే, తెలంగాణ నుంచి ఇద్దరు మంత్రులుగా ఉండి నిధుల కేటాయింపునకు కృషి చేయలేదని, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి నిధులు కేటాయించాలని నినదిస్తే మంత్రులు మాట్లాడలేదని, అలాంటి బండి సంజయ్ రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడడం బాధాకరమన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఫొటోగ్రాఫర్లు



హుజూరాబాద్: హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటోఎక్స్‌పో కార్యక్రమానికి హుజూరాబాద్ మండల ఫొటోగ్రాఫర్లు ఆదివారం తరలివెళ్లారు. నూతన ఫొటో, వీడియో కెమెరాల లాంచింగ్‌తో పాటు ఫొటోగ్రఫీలో మెలకువలు పరిచయం చేయనున్నారని తెలిపారు. వెళ్లిన వారిలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎండీ యాకుబ్ అలీ, కోశాధికారి హరిప్రసాద్‌లున్నారు.



ఎస్సీకాలనీ సమీపంలో రోడ్డు దుస్థితి



సబ్‌స్టేషన్ సమీపంలో నరకయాతన పడుతున్న వాహనదారులు

- వర్షాలకు అధ్వానంగా సబ్‌స్టేషన్‌రోడ్డు
- కిలోమీటర్ మేర నడవడానికే నరకయాతన

రోజూ సర్కస్ ఫీట్లే

వీణవంక: ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని బేతిగల్ గ్రామంలో మట్టిరోడ్ల రూపురేఖలుమారిపోయాయి. కాలుతీసి కాలు వేయాలంటే నరకయాతన పడుతున్నారు. గ్రామ శివారులోని ఎస్సీకాలనీ నుంచి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు సుమారు కిలోమీటర్ మేర మట్టి రోడ్డు ఉంది. వర్షాలకు దారి బురదమయంగా మారింది. సబ్‌స్టేషన్‌కు వెళ్లే అధికారులతో పాటు రైతుల అవస్థలు వర్ణణాతీతం. బురదలో నడవడంతో కాళ్లు చెడి ఆసుపత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ రైతు ద్విచక్రవాహనంపై సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లుండగా అదుపుతప్పి బురదలో పడిపోయాడు. ఇదీ ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు. ఈ దారి గుండా వెళ్లే ఇతర రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది దుస్థితి.

ఎన్నో ఏళ్లుగా నరకయాతన..

పదేళ్ల క్రితం బేతిగల్ శివారులో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ నుంచి బేతిగల్, వల్భాపూర్ గ్రామాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఎస్సీకాలనీ నుంచి సబ్‌స్టేషన్ వరకు సుమారు కిలోమీటర్ మేర మట్టి రోడ్డే ఉంది. ఇదే దారి మీదుగా 550 ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన రైతులు పొలాల వద్దకు వెళ్తుంటారు. వర్షాలు కురిసినప్పుడల్లా దారి బురదమయంగా మారుతుంది. గుంతలు పడి నడవలేని పరిస్థితి, ఎన్నికల సమయంలో వచ్చే నాయకులకు ఎన్నోసార్లు రోడ్డు దుస్థితిపై వివరించారు. సీసీ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చిన ఇంతవరకు పట్టించుకున్న నాథుడే లేడు. సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఏడాది రేతులే విరాళాలు సేకరించి రోడ్డుపై మట్టి పోయించారు. కానీ ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సబ్‌స్టేషన్‌కు వెళ్లే ట్రాన్స్‌కో సిబ్బంది పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సీసీరోడ్డు వేయించాలని రైతులు కోరుతున్నారు.



మానకొండూర్‌లో నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



చిగురుమామిడి: నవాబుపేట్‌లో పోచమ్మ బోనాల ఊరేగింపులో మహిళల డ్యాన్స్

బోనమెత్తిన పల్లెలు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో రెడ్డి సంఘం, ఇందుర్తిలోని ఒకటో వార్డుకు చెందిన విశ్వబ్రాహ్మణులు ఆదివారం పోచమ్మతల్లి బోనాల జాతర నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, బైండ్లవారి ఆటపాటల మధ్య వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఐలిరెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ కులసంఘం అధ్యక్షుడు విష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి, ఉపాధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి శంకరాచారి, ఆర్‌ఎంపీ రాజేందర్, మామిడాల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఇంటికో బోనంతో ఆలయానికి చేరుకొని మొక్కులు సమర్పించారు. సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రామడుగులో ఆలయం వద్ద భక్తుల కోలాహలం

మానకొండూర్: మండల కేంద్రంలో గ్రామస్తులు మహంకాళి తల్లి బోనాలు నిర్వహించారు. వివిధ కులాల మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయం చేరుకొని నైవేద్యం, బోనాలు, మొక్కులు చెల్లించారు. పిల్లా పాపలు, పాడిపంటలను చల్లంగ చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



తిమ్మాపూర్: పోరండ్లలో మహిళల మొక్కులు

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పిల్లా పాపలను చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎల్లాల సదానందరెడ్డి, నాగిరెడ్డి కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్నివసతులు కల్పించడంతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా కృషి చేయాలని చైర్మన్ కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, డైరెక్టర్లను కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, కౌన్సిలర్ కొట్టె అశోక్, నాయకులు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, పురం రాజేశం, ముద్దసాని రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇల్లందకుంట: రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను మండలంలోని వాగొడ్డు రామన్నపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సునీల్, నరెడ్ల అనిల్, పల్లవిని రాజు, పుట్ట శ్రీకాంత్, పుట్ట శ్రీధర్, బోడ రాకేష్, అన్నారపు రాజేష్, పుట్ట రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన ఆలేటి కనుకమ్మకు సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైంది. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వరహాల చారీ ఆదివారం అందజేశారు. మాజీ సర్పంచ్ కొంరయ్య, రాములు, రవీందర్‌ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. మొత్తం 15 మందికి రూ. 2.97 లక్షల చెక్కులు మంజూరుకాగా పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

నాల్గో రోజు కొనసాగిన దీక్ష

గంగాధర: ఉపాధి కల్పించాలని మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన చేనేత కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాల్గో రోజుకు చేరింది. ప్రభుత్వం పని కల్పించి ఆదుకోవాలని, లేదంటే పస్తులుండే పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరాహార దీక్షకు మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన చేనేత కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

ఒద్యారంలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గంగాధర: మండలంలోని ఒద్యారం గ్రామంలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్వారీ నిర్వాహకుడు విష్ణుకాంత్ ప్రారంభించి మాట్లాడారు. క్వారీల్లో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యం కోసం మెడికవర్ ఆసుపత్రివారు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. రెండు వందల మందికి పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశామని, వేరే ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులకు వైద్య సేవలు ఒకే చోట అందించడానికి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు చీటి కార్తిక్, పబ్బ అనీశ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శంకరపట్నం: సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ డిమాండ్ చేశారు. 'బురదనీటిలో పాఠశాలకు'అనే కథనం ఆదివారం సాక్షిలో ప్రచురితం కావడంతో స్పందించిన విద్యార్థి సంఘం నాయకులు కేశవపట్నం హాస్టల్‌ను తదివారం సందర్శించారు. గదులకు దోమతెరలు, విద్యార్థులకు షూ, దుప్పట్లు, బెడ్, బెడ్‌షీట్స్ లేవని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలన్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది సర్వే

శంకరపట్నం: మండలంలోని ధర్మారం ఎస్సీకాలనీలో ఆదివారం ట్రాన్స్‌కో సిబ్బంది సర్వే చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్‌యోజనకు ఎస్సీకాలనీని ఎంపిక చేశారు. ఈమేరకు లైన్‌మెన్ శ్రీనివాస్, జేఎల్‌ఎం రమేశ్ తదితరులు సర్వే చేపట్టారు. వంగిన విద్యుత్‌స్తంభాలు, విద్యుత్ మీటర్లులేని ఇళ్లు, లూజ్‌వైర్లు, ఓవర్‌లోడ్ వంటి వివరాలు సేకరించారు.

కేశవపట్నం పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా భిక్షపతి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా వంగ భిక్షపతి ఎన్నికయ్యారని మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ తెలిపారు. కేశవపట్నంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సంఘం గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఓంపతి, విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వీరాస్వామి, కోశాధికారిగా తిరుపతి, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మహేందర్, సభ్యులుగా మార్కండేయ, సుధాకర్, జనార్దన్, సంపత్, తిరుపతి ఎన్నుకున్నారు. సమావేశంలో హన్మంతు, సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ

తిమ్మాపూర్: తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పొలంపల్లికి చెందిన ఖమ్మం కృష్ణను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రవి తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు తనవంతుగా పాటుపడతానని, సమస్యల మీద పోరాటాలు చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానయ్య, మీడియా ఇన్‌చార్జి గోపి, నేదునూరు సర్పంచ్ వడ్లూరి శంకర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాజావీరు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మన్‌కీబాత్' వీక్షించిన నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ నాయకులు ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, పట్టణ ఉపాధ్యక్షులు శశిధర్, రమేశ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు సంపత్, అధ్యక్షుడు సారయ్య, శక్తి కేంద్ర ఇన్‌చార్జి వెంకటేశ్, బూత్ అధ్యక్షుడు దేవేంద్రలున్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటడ్డి, నరేందర్, ఆదిరెడ్డి, కొండాల్ అనిల్, శ్రావణ్ మన్‌కీబాత్ వీక్షించారు.

మహిళ అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: పట్టణంలో ఓ వివాహిత అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి ఆదివారం తెలిపారు. పట్టణంలోని శాలవాడకు చెందిన రాచపల్లి సంధ్య శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదని, భర్త రాచపల్లి సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



వరద ఉధృతి తగ్గేదాకా ఆగాల్సిందే

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగుకు అటువైపు ఉన్న పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. ఆదివారం రైతు నేదురు సమ్మయ్య పొలంలో గడ్డిమందు చల్లేందుకు వాగు దాటడానికి సాహసం చేశాడు. వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీటిలో కొంతదూరం వెళ్లాక జారిపడ్డాడు. నీటిలో కొట్టుకుపోతానని భయపడి వెంటనే వెనుదిరిగాడు.

హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి విద్యార్థులు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హుజూరాబాద్/రామడుగు: హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004–05, రామడుగు మండలం వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2001–02 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు ఒక్కచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చదివిన పాఠశాలలకు అవసరమైన వస్తువులను సమకూర్చారు.



వెదిర జెడ్పీహెచ్‌ఎస్ 2001-02 పదో తరగతి విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న పీఏసీఎస్, మున్సిపల్ చైర్మన్లు సంపత్, రాజేశ్వర్‌రావు, సిబ్బంది

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. చెట్ల పెంపకం, సంరక్షణతో పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని, కాలుష్య రహిత ఆక్సిజన్ మానవాళికి అందుతుందన్నారు. సుమారు రెండువేల మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మామిడి తిరుపతి, డీసీవో రామాంజనేయ స్వామి, సొసైటీ డైరెక్టర్లు, అడిటర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు, స్టడీచైర్స్ ఇవ్వాలి

జమ్మికుంట: హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, స్టడీ చైర్స్, నోట్‌బుక్స్ ఇవ్వాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అన్నారు. పట్టణంలోని బాలికల హాస్టల్‌ను ఆదివారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, ముందస్తు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని, మెనూ ప్రకారం పోష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెపల్లి రంజిత, శ్రీకాంత్, ఇల్లందుల శ్రీనాథ్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న చిన్ననాటి మిత్రులు

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య ఇటీవల సౌదిఅరేబియాలో మృతి చెందాడు. అంజయ్యతో చదువుకున్న చిన్ననాటి మిత్రులు రూ.53,580 సేకరించి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలని ఆర్థికసాయం చేశామన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, తిరుపతి, రవీందర్, శివ, ఆశీర్వాదం, సామల తిరుపతి, దేవసాని మార్కండేయ, నరేంద్రచారి, పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి..



నగదు అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు మాచర్ల నాగేశ్వర్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.5వేలు అందజేశారు. ప్రమాదవశాత్తు గీత కార్మికులు చనిపోతే వెంటనే ప్రభుత్వం ఎక్స్‌గ్రేసియా కింద రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లుగౌడ్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు విజయ్‌గౌడ్, సమ్మయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్, వీరస్వామి, సాంబయ్య, ఐలయ్యగౌడ్ పాల్గొన్నారు.